సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 19.37 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 19.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,100
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,757
3శాతం జీఎస్టీతో	రూ.5,929
నవర (8గ్రా)	రూ.47,432

గరిష్టం/కనిష్టం
35.0 /23.6

వాతావరణం
బుధవారం గాలిలో తేమ 57 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గురువారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అబ్జర్వర్ల నియామకం


చంద్రశేఖర్‌రెడ్డి


సుకుమార్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్లను నియమించారు. నెల్లూరు సిటీకి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కందుకూరుకు మన్నెమాల సుకుమార్‌రెడ్డిని నియమించారు. అబ్జర్వర్లుగా నియమితులైన వారు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

మన్నెమాలపై సస్పెన్షన్ ఎత్తివేత

కావలి: నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డిపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను బుధవారం విడుదల చేసింది. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫారాలను తగు జాగ్రత్తలతో నిబంధనల మేరకు పరిష్కరిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 19,18,315 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో గల 2317 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు, సూపర్‌వైజర్లను పూర్తిస్థాయిలో నియమించామని చెప్పారు. ఫారం – 6లు 1662.. ఫారం – 7లు 1748.. ఫారం – 8 దరఖాస్తులు 423 పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మురళీధర్‌రెడ్డి, నారాయణ, టీడీపీ నుంచి హరికృష్ణ, రసూల్, కాంగ్రెస్ నేత బాలసుధాకర్ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో న్యాయవిజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న వాణి

వెంకటాచలం: చెముడుగుంట సమీపంలోని కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఖైదీలకు వసతులు సక్రమంగా ఉన్నాయాననే అంశాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడారు. జైలు జీవితం అనుభవించి బయటకొచ్చాక తప్పుల ను మళ్లీ చేయొద్దని సూచించారు. అందరితో కలిసి మెలిసి ఉంటూ.. వివాదాల జోలికెళ్లొద్దన్నారు. అవసరమైన వారికి న్యాయసేవలను ఉచితంగా అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, జైలర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 528 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 528 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి మధుమతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7798 మందికి గానూ 7270 మంది హాజరయ్యారని తెలిపారు.

6న పొగాకు వేలం ప్రారంభం

కందుకూరు: జిల్లాలో ఈ సీజన్ పొగాకు వేలాన్ని మార్చి ఆరున ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు రైతులు, వ్యాపారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు నిర్ణయం తీసుకున్నారు. కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో మార్చి ఆరున.. అనంతరం మూడో విడతలో కలిగిరి, డీసీపల్లి కేంద్రాల్లో వేలం ప్రారంభం కానుంది.

ప్రజారోగ్యంతో చెలగాటం

కోళ్ల వ్యర్థాలపై నిషేధమేదీ..?
- పక్క రాష్ట్రాల నుంచి జిల్లాకు నిత్యం టన్నుల కొద్దీ రవాణా
- చేపలకు మేతగా వినియోగిస్తున్న వైనం
- బర్డ్ ఫ్లూ ప్రబలినా కట్టడికి చర్యలు శూన్యం
- రూ.లక్షల్లో మామూళ్లు
- పట్టించుకోని పోలీసులు, మత్స్యశాఖ అధికారులు

జిల్లాను ముంచెత్తుతున్న కోళ్ల వ్యర్థాలు ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. పక్క రాష్ట్రాల నుంచి టన్నుల కొద్దీ కోళ్ల వ్యర్థాలను జిల్లాకు నిత్యం యథేచ్ఛగా తరలిస్తున్నారు. కుళ్లిపోయిన మాంసం వ్యర్థాలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి.. చేపల గుంతల్లో మేతగా వేస్తున్నారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ విక్రయాలపై నిషేధం విధించిన అధికారులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కోళ్ల రవాణాకు అడ్డుకట్ట వేశారు. అయితే కోళ్ల వ్యర్థాల రవాణాకు మాత్రం ముకుతాడు వేయలేకపోతున్నారు.


కోళ్ల వ్యర్థాల తరలింపునకు ఉపయోగించే పెద్ద డ్రమ్ములు


కోళ్ల వ్యర్థాల తరలింపు వాహనాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కరోనా తర్వాత ప్రజలను భయపెడుతున్న ప్రాణాంతక వైరస్ బర్డ్ ఫ్లూ. కేరళను కొంత కాలం వణికించిన బర్డ్ ఫ్లూ ఇప్పుడు జిల్లా వాసులనూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ తరుణంలో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. జిల్లాలో కోళ్లు, చికెన్ విక్రయాలను కొద్ది రోజుల పాటు నిషేధించింది. అయితే కోళ్ల వ్యర్థాల కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు

జిల్లాలోని కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల్లో రెండు వేల ఎకరాల్లో చేపల పెంపకాన్ని సాగిస్తున్నారు. వీటికి వినియోగించే ఫీడ్ ఖరీదు కావడంతో పోషణ రైతులకు భారంగా మారింది. సాధారణంగా చేపలు కిలోకు పైగా పెరిగేందుకు ఆర్నెల్ల నుంచి ఎనిమిది నెలలు పడుతుంది. రైతుల నుంచి చేపలను కిలోను రూ.80 నుంచి రూ.90కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నష్టాలే ఎక్కువగా వస్తున్నాయి. ఈ తరుణంలో కోళ్ల మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు ప్రత్యామ్నాయంగా కోళ్ల వ్యర్థాలను ఆహారంగా వినియోగిస్తున్నారు. వీటితో నాలుగు నెలలకే కిలోకుపైగా బరువు పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దాదాపు 80 శాతం మంది చేపల రైతులు కోళ్ల వ్యర్థాలనే వినియోగిస్తున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను జిల్లాకు తీసుకొచ్చి విక్రయించే మాఫియా తయారైంది. అక్కడ కిలో ఐదారు రూపాయలకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.15కు విక్రయిస్తున్నారు.

నిషేధిత వ్యర్థాలు జిల్లాలో డంప్

కోళ్ల వ్యర్థాలను చేపలు, రొయ్యలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ అన్ని రాష్ట్రాలకు కేంద్రం గతేడాది ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలను ధిక్కరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినా, అనేక రాష్ట్రాల్లో అమలు కావడం లేదు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలో కోళ్ల వ్యర్థాలను నిషేధించడంతో వాటిని ప్రధానంగా జిల్లాకు నిత్యం టన్నుల్లో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. తమిళనాడు నుంచి తడ మీదుగా.. కేరళ, కర్ణాటక నుంచి నాయుడుపేట మీదుగా జిల్లాకు తరలిస్తున్నారు. వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వెదజల్లుతున్నా, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పెట్టి వాహనాల్లో రాత్రి వేళ తరలిస్తున్నారు. సదరు వాహనాలు వెళ్లినంత దూరం పావు గంట పాటు దుర్గంధం తగ్గడంలేదు.

నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

వీటిని కట్టడి చేయడంలో పోలీసులు, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.లక్షల్లో మామూళ్లు ముట్టజెప్తున్నారని సమాచారం. సరిహద్దు ప్రాంతం నుంచి డంప్ చేసే ప్రాంతం వరకు ఈ వ్యవహారం జరుగుతోందని తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాలు, వాహనం పాడైన సందర్భాల్లో వ్యర్థాల రవాణా వెలుగులోకి వస్తోంది.

నిత్యం వంద టన్నులకుపైగా రవాణా

తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి నిత్యం సుమారు వంద టన్నులకు పైగా కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్నారని సమాచారం. రాత్రి బయల్దేరి తెల్లారేసరికి చేపల గుంతల వద్దకు ఈ వాహనాలు చేరుకుంటున్నాయి. వీటిని వేగంగా రవాణా చేసేందుకు ప్రత్యేక వాహనాలను వినియోగిస్తున్నారు. తమిళనాడు నుంచి 15 – 20, కేరళ నుంచి 10, కర్ణాటక నుంచి 10 – 15 వాహనాల్లో వీటిని నిత్యం రవాణా చేస్తున్నారని సమాచారం. ఒక్కో వాహనంలో ఐదు నుంచి పది టన్నుల వరకు తరలిస్తున్నారు.

చర్యలు చేపడతాం

చేపల గుంతలకు కోళ్ల వ్యర్థాల తరలింపును నిషేధించారు. ఇతర రాష్ట్రాల నుంచి రవాణా చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వ్యర్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.
– నాగేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ

మదినిండా గౌతమ్ జ్ఞాపకాలే..

- రెండో వర్ధంతి సందర్భంగా ఘన నివాళి
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు
- స్మారక చిహ్నం ఏర్పాటుకు భూమి పూజ


గౌతమ్‌రెడ్డి పేరిట నిర్మించనున్న స్మారక చిహ్నానికి భూమి పూజ చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కుటుంబసభ్యులు

ఉదయగిరి: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని స్థానిక మేకపాటి వ్యవసాయ కళాశాలలో కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మేకపాటి అభిమానులు భారీగా తరలివచ్చారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి.. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తొలుత కళాశాల ప్రాంగణంలోని గౌతమ్‌రెడ్డి ఘాట్ వద్ద మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మణిమంజరి, దివంగత నేత సతీమణి కీర్తిరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి పృథ్వీరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి దంపతులు, అభినవ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి దంపతులు, బంధు మిత్రులు ఘనంగా నివాళులర్పించారు. మాడుగుల ఫణీంద్రశర్మ ప్రవచించారు. అనంతరం అన్నమయ్య కీర్తనలను ప్రముఖ గాయకులు ఆలపించారు. నృత్యంతో ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి మహేశ్వరి అలరించారు. అనంతరం ఫణీంద్రశర్మ, కళాకారులను మేకపాటి కుటుంబసభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడారు. గౌతమ్ మరణం అత్యంత విషాదకర ఘటన అని చెప్పారు. ప్రజలకు సేవ చేస్తూ.. రాజకీయంగా మంచి పేరు తెచ్చుకుంటున్న సమయంలో తమ ఇంట ఈ ఘటన చోటుచేసుకొని రెండేళ్లయినా ఆ షాక్ నుంచి ఇంకా కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం సంగం బ్యారేజీ, వ్యవసాయ కళాశాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంతాలకు తాగు, సాగునీరు వెలుగొండ నుంచి త్వరలోనే వస్తాయని, దీంతో తమ కుటుంబ కల నెరవేరనుందని చెప్పారు.


భారీగా తరలివచ్చిన మహిళలు

భూమి పూజ

స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో రూ.ఏడు కోట్లతో ఏర్పాటు చేయనున్న స్మారక చిహ్నం, పార్క్ ఏర్పాటుకు సంబంధించిన భూమి పూజను మేకపాటి కుటుంబసభ్యులు నిర్వహించారు. వ్యవసాయ కళాశాల ముఖద్వారం వద్ద మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ స్మృతి వనాన్ని ప్రముఖ ఆర్కిటెక్చర్ నిపుణుల పర్యవేక్షణలో నిర్మించనున్నారు.

ఐ డోంట్ కేర్..

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- ఉన్నతాధికారుల నుంచి వచ్చిన లేఖలను మాయం చేస్తున్న వైనం
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ ఉన్నతాధికారి తీరు

నేను మోనార్క్‌ని.. నన్నెవరూ ఏమీ చేయలేరు.. అనే ఈ డైలాగ్ ఓ చిత్రంలో సుపరిచితం. దీన్ని స్ఫూర్తిగా తీసుకున్నారో.. ఏమో గానీ నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో ఓ మహిళా ఉన్నతాధికారి సైతం ఇదే తీరును అవలంబిస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో ఓ మహిళా ఉన్నతాధికారి తీరు వివాదాస్పదంగా మారింది. ఎన్ని తప్పులు చేసినా.. వాటి నుంచి సునాయాసంగా తప్పించుకోవడంలో ముందంజలో ఉంటున్నారు. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ నుంచి వచ్చిన ఎలాంటి లేఖనైనా సదరు అధికారి బేఖాతర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెప్పింది చేయకపోతే వేధింపులే..

చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పరిపాలనాధికారి (ఏఓ)గా విధులు నిర్వర్తించే ఆమె పదోన్నతిపై ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2020, ఆగస్టులో నియమితులయ్యారు. ఆది నుంచి వివాదాస్పద ధోరణినే ఆమె అవలంబిస్తున్నారు. హోదాను మరిచి తన డిపార్ట్‌మెంట్‌లోని ఉద్యోగులను పనివారిలా చూస్తున్నారు. ఈమె వ్యవహార తీరు ఇక్కడ విధులు నిర్వర్తించే ఏ ఉద్యోగికీ నచ్చడం లేదు. అయితే సదరు అధికారి చెప్పింది వినకపోతే తమపై ఎలాంటి చర్యలు చేపడతారోననే భయం వారిని వెంటాడుతోంది.

ఫిర్యాదుల పరంపర.. చర్యలు శూన్యం

➡ ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సీ, ఎస్టీలను సదరు ఉన్నతాధికారి వేధిస్తున్నారంటూ అక్కడి ఉద్యోగులు అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబుకు 2022, జనవరి ఏడున ఫిర్యాదు చేశారు.

➡ సదరు ఉన్నతాధికారిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి తనకు నివేదికను సమర్పించాలని అదే ఏడాది జనవరి 18న కళాశాల ప్రిన్సిపల్‌కు కలెక్టర్ లేఖ పంపారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు.

➡ 2023, సెప్టెంబర్‌లో సీనియార్టీ లిస్ట్‌ను పంపాలని ఉన్నతాధికారులు కోరితే, తనపై కక్షగట్టి తన పేరును మినహాయించి మిగిలిన వారి పేర్లను సదరు ఉన్నతాధికారి పంపారని తోటి ఉద్యోగుల ఎదుట ఓ క్లర్క్ ఆవేదనను వెళ్లబోసుకున్నారని సమాచారం.

➡ పదోన్నతికి తాను అర్హురాలినని.. తనకు అవకాశం కల్పించాలని సదరు ఉన్నతాధికారిని ఓ మహిళా ఉద్యోగి కోరారు. అయినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఆమె ఈ నెల 12న ఫిర్యాదు చేశారు.

కలెక్టర్ ఆదేశాలూ బుట్టదాఖలు

సదరు మహిళా ఉన్నతాధికారిపై పలు ఫిర్యాదులు అందాయి. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కలెక్టర్ హరినారాయణన్ పంపారు. ఆమెపై చర్యలు తీసుకొని.. తనకు ఒక కాపీని పంపాలని ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలకు ఈ నెల ఒకటిన లేఖను ఆయన పంపారు. అయితే ఈ లేఖ సంబంధిత అధికారికి వారం రోజులైనా చేరలేదు. వాస్తవానికి వైద్య కళాశాలకు ఏ రోజు వచ్చిన లేఖలను ప్రిన్సిపల్ అదే రోజు పరిశీలించి వాటిని సంబంధిత అధికారికి పంపుతారు. అయితే సదరు లేఖను మహిళా ఉన్నతాధికారే మాయం చేశారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. తీరా చివరికి ఎనిమిదో రోజున ఈ లేఖ బయటకొచ్చింది. ఇందులో ఉన్న సారాంశానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు.

భవిష్యత్తులో వర్సిటీగా మార్పు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలను భవిష్యత్తులో వ్యవసాయ విశ్వవిద్యాలయంగా మార్పు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించిన గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాలకు హాజరైన మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్‌రెడ్డి, కూచిపూడి కళాకారిణి మహేశ్వరిని మేకపాటి కుటుంబీకులు సత్కరించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజలకు సేవ చేస్తూ అజాత శత్రువుగా గౌతమ్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గౌతమ్‌రెడ్డి అకాల మరణం రాష్ట్ర ప్రజలతో పాటు మేకపాటి కుటుంబసభ్యులకు తీవ్ర క్షోభను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయగిరిలోని మెరిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్చారని, ఈ మంచి కార్యక్రమంలో వ్యవసాయ మంత్రిగా తన ప్రమేయం ఉండటం అదృష్టమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, ఆ తర్వాత వ్యవసాయ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్పు చేయడం ఖాయమన్నారు.

ఏసీబీ వలలో కొండాపురం ఎస్సై

- కేసు లేకుండా చేస్తానని లంచం డిమాండ్
- నగదును పెట్రోల్ బంకు ఆపరేటర్‌కు ఇవ్వాలని సూచన
- ఇద్దర్నీ పట్టుకున్న ఏసీబీ అధికారులు


కొండాపురం ఎస్సై, పెట్రోల్ బంకు ఆపరేటర్

కొండాపురం: స్థానిక ఎస్సై ఖాజావలీ ఏసీబీ అధికారులకు బుధవారం చిక్కారు. ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ పి.శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లి గ్రామానికి చెందిన కుక్కపల్లి చిన హజరత్తయ్యపై 2023 జూన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. అదే ఏడాది ఆగస్టులో చిన హజరత్తయ్య వేధిస్తున్నారంటూ అతని భార్య కొండాపురం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ రెండు విషయాల్లో ఎస్సై ఖాజవలీ కేసు నమోదు చేశారు. అట్రాసిటీ కేసు విషయంలో డీఎస్పీ విచారణ లేకుండా చేసి 41 నోటీసులిచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు అరెస్ట్ కాకుండా చూస్తానని.. భార్య పెట్టిన కేసును సైతం రాజీ చేసి తొలగిస్తానని హజరత్తయ్యకు ఎస్సై చెప్పారు. దీనికి రూ.30 వేల లంచమివ్వాలని డిమాండ్ చేశారు. తొలుత రూ.25 వేలు ఇవ్వాలని చెప్పారు. కాగా లంచమివ్వడం ఇష్టం లేక హజరత్తయ్య తన మిత్రుడైన అరిగెల విజయకుమార్‌తో కలిసి ఏసీబీ అధికారులను ఈనెల 16న ఆశ్రయించారు.

వేరే చోట ఇవ్వాలని చెప్పి..

అధికారుల సూచనల మేరకు హజరత్తయ్య, విజయకుమార్ ఎస్సైకి రూ.25 వేలు ఇచ్చేందుకు పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వెళ్లారు. అయితే ఆయన నగదు తీసుకోకుండా తెలివిగా వ్యవహరించారు. కొండాపురంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న పంప్ ఆపరేటర్ పార్వతికి డబ్బులివ్వాలని సూచించారు. దీంతో వీరిద్దరూ అక్కడికి వెళ్లి ఆ మహిళకు డబ్బు అందజేయగా, ఇదే విషయాన్ని ఎస్సైకి ఆమె తెలిపారు. మొదటి నుంచి వారిని అనుసరిస్తున్న ఏసీబీ అధికారులు పెట్రోల్ బంకు వద్ద పార్వతిని అదుపులోకి తీసుకున్నారు. కెమికల్ పరీక్షలు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సై ఖాజావలీని అదుపులోకి తీసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు పెట్రోల్ బంక్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఎస్సై ఖాతాకు రూ.ఐదు లక్షల వరకు చేరిన అంశాన్ని అధికారులు గుర్తించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. ఏసీబీ సీఐలు ఆంజనేయులురెడ్డి, కిరణ్, విజయకుమార్, శ్రీనివాసులు, ఇద్దరు ఎస్సైలు, 15 మంది సిబ్బంది పాల్గొన్నారు.



SBI భారతీయ స్టేట్ బ్యాంక్
నార్త్‌రాజుపాలెం బ్రాంచ్, నార్త్‌రాజుపాలెం
కొడవలూరు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఇ-మెయిల్: 15306@sbi.co.in

సంక్షిప్త డిమాండు నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

(I) ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ ఆర్2 యునిసెక్స్ సెలూన్, ప్రొప్రైటర్ : కలసపాటి రామకృష్ణ, తండ్రి : స్వామి రంగయ్య, ఆభిరాం హోటల్, ఆవారి వీధి, మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు-524001. 2) శ్రీ కలసపాటి రామకృష్ణ, తండ్రి : స్వామి రంగయ్య, ప్రొప్రైటర్ : మెస్సర్స్ ఆర్2 యుని సెక్స్ సెలూన్, ఆభిరాం హోటల్, ఆవారి వీధి, మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు-524001.
హామీదారు : శ్రీ కలసపాటి రంగారావు, తండ్రి : లేటు రంగనాయకులు, ఫ్లాట్ నెం.04, ...
(II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం : పెర్శ్ లోన్ ఖాతా నెం.62460836878
(III) చెల్లించవలసిన బాకీ మొత్తము : తేది.31.01.2024 నాటికి రూ.5,51,993/- ...
తేది.01-02-2024 నుండి ...
(IV) డిమాండ్ నోటీసు తేది : 31.01.2024 ఎన్‌పిఏ తేది : 09.08.2023
(V) ఆస్తి వివరములు : ఐటమ్ నెం.1 : (రిజిష్టర్డు అమ్మకపు దస్తావేజు నెం.2646/2005, షాప్ నెం.5, తేది.21.02.2005 ప్రకారం శ్రీ కలసపాటి రంగారావు, తండ్రి : లేటు రంగనాయకులు గారి పేరున గల షెడ్యూల్ ఆస్తి) ...
ఐటమ్ నెం.2 : (రిజిష్టర్డు అమ్మకపు దస్తావేజు నెం.1373/2008, షాప్ నెం.6, తేది.02.04.2008 ప్రకారం శ్రీ కలసపాటి రంగారావు, తండ్రి : లేటు రంగనాయకులు గారి పేరున గల షెడ్యూల్ ఆస్తి) ...

తేది : 31.01.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : నార్త్‌రాజుపాలెం భారతీయ స్టేట్ బ్యాంక్

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- కలెక్టర్ హరినారాయణన్
- పోలింగ్ కేంద్రాలు, ఈవీఎం గదుల పరిశీలన


మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు: 'జిల్లాలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యం. ఇందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలి' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. ఆత్మకూరు పట్టణంలో ఈవీఎంలు భద్రపరిచే గది, నామినేషన్లు స్వీకరించే మున్సిపల్ కార్యాలయంలో గదులను, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను నిర్వహించే ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆర్డీఓ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయానికి మార్చాలన్నారు. అదే క్రమంలో నామినేషన్ల స్క్రూటినీ, అభ్యర్థులు వేచి ఉండే గదులు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల అధికారుల శిక్షణ కోసం నిర్వహించే ఏర్పాట్లను పరిశీలించారు. అదే క్రమంలో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మరో భవనానికి మార్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఆర్‌ఐ పృథ్వీరాజ్, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలి


జిల్లా విద్యాశాఖాధికారితో కాంప్లెక్స్ పీఈటీలు

- డీఈఓ రామారావు

ఆత్మకూరు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జె.రామారావు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా డీఈఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. ఈ సందర్భంగా డీఈఓ, కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పీఈటీలు తిరుపతయ్య, సురేష్, గౌరి, జమునా రాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా..

- స్కూటీని ఢీకొన్న ఐషర్ వాహనం
- యువకుడి మృతి


వెంకటేష్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): స్కూటీలో పెట్రోల్ పట్టించుకుని రోడ్డు దాటుతుండగా ఐషర్ వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన నెల్లూరు మినీబైపాస్ జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలో జరిగింది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. ఫత్తేఖాన్‌పేటకు చెందిన బి.వెంకటేష్ (20) స్థానిక రైతుబజారు సమీపంలో పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతడికి పడారుపల్లి సుందరయ్యకాలనీకి చెందిన ఫ్లవర్ డెకరేటర్ గోవర్ధన్, కనుపర్తిపాడుకు చెందిన ప్లంబర్ సునీల్ స్నేహితులు. బుధవారం తెల్లవారుజాము వరకు ముగ్గురూ కలిసి పూల దుకాణంలో తమ స్నేహితుని వివాహం కోసం పూలమాలలు తయారు చేశారు. పని పూర్తయ్యాక వెంకటేష్ తన స్కూటీపై స్నేహితులను ఇళ్ల వద్ద వదిలిపెట్టేందుకు మినీబైపాస్ మీదుగా బయలుదేరాడు. జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకుని రోడ్డు దాటే క్రమంలో అయ్యప్పగుడి వైపు నుంచి ఆత్మకూరు బస్టాండ్ వైపు వేగంగా వెళ్తున్న ఐషర్ వాహనం స్కూటీని ఢీకొంది. దీంతో వెంకటేష్ తలపగిలి అక్కడికక్కడే మృతిచెందగా గోవర్ధన్, సునీల్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేష్ మృతితో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ


సాయికిరణ్

ఆత్మకూరు: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో ఆత్మకూరుకు చెందిన తిరుపతయ్య కుమారుడు పి.సాయికిరణ్ బంగారు పతకం సాధించాడు. 16 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పోటీల్లో 55 - 60 కేజీల వెయిట్ కేటగిరీలో సాయికిరణ్ బంగారు పతకం సాధించాడు. ఇంకా ఫెడరేషన్ కప్ ఆఫ్ ఆలిండియా జాతీయ పెన్కాక్ సిలాట్ ఆర్టిస్టిక్స్ ఈవెంట్‌లో ప్రతిభ చూపాడు. దీంతో సాయికిరణ్‌ను స్థానికులు బుధవారం అభినందించారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా
బృంధావనం శాఖ, నెల్లూరు జిల్లా

మా విలువైన ఖాతాదారుల గమనిక నిమిత్తం ఇవ్వబడ్డ ప్రకటన
మా ఖాతాదారులకు మరింతగా విస్తృత సేవలందించు బ్యాంక్ ఆఫ్ బరోడా, బృంధావనం శాఖలో కొన్ని పరిపాలనా సౌకర్యాలను పెంపొందించు ఉద్దేశ్యంతో మా ప్రస్తుత చిరునామాలోని అనగా డోర్ నెం.381, గేటూరు వారి వీధి, బృంధావనం, నెల్లూరు శాఖను డి.నెం.1093-1, వార్డు నెం.27-1, చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా, రాంజీ నగర్, 2వ లైన్, నెల్లూరు (ఉద్దేశిత బ్యాంక్ / శాఖ పేరు & ప్రస్తుత చిరునామా) వద్దకు మారుస్తున్నట్లుగా మరియు తేది.29-02-2024 (మార్పు తేది) నుండి సదరు చిరునామా నుంచే పని చేస్తుందని తెలుపడమైనది. సదరు క్రొత్త వసతి, చిరునామా నుండి అన్నిరకాల సాధారణ బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలతో పనిచేయును.
మా బృంధావనం శాఖలోని లాకర్ సదుపాయాలు గల ఖాతాదారులందరికీ మరల మేము తెలియజేయడమేమనగా ఈ కొత్త చిరునామాలోకి లాకర్లు మారుస్తున్నప్పుడు కావాల్సిన జాగ్రత్తలు మేము తీసుకొందుము. అయినప్పటికీ ఈ మార్పు వలన జరిగే రిస్కు మరియు నష్టాన్ని తగ్గించుకోవటానికి ఒకవేళ లాకరు ఉన్న ఖాతాదారుడు తాము భద్రపరిచిన వస్తువులను స్వాధీనం చేసుకొని, కొత్త వసతికి మార్చినంతట మరల బ్యాంకులో భద్రపర్చదల్చినచో వారు తేది.23-02-2024న గాని లేదా ఆలోగా గాని చేసుకోవచ్చును.
ఈ విషయములో మీకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాం. మరియు మా ఉన్నత సేవలను అన్నివేళలా మీకు అందించగలమని మీకు హామీ ఇస్తున్నాం.

క్రొత్త లోకేషన్ అడ్రస్ కొరకు ఇక్కడ స్కాన్ చేయండి

స్థలం: నెల్లూరు
తేది: 21-02-2024
సం/- రీజనల్ హెడ్
రీజియన్ పేరు: గుంటూరు రీజియన్

ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి


మాట్లాడుతున్న మస్తాన్‌రావు, చిత్రంలో వీసీ సుందరవల్లి తదితరులు

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

వెంకటాచలం: విక్రమ సింహపురి విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో పలు పరిశ్రమల యాజమాన్యాలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా బీద హాజరై మాట్లాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాకో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారన్నారు. దీంతో నెల్లూరులో వీఎస్‌యూ ఏర్పాటైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాలుగేళ్లలో వర్సిటీలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. విద్యార్థులకు తన పరిశ్రమలతో పాటు, ఇతర వాటిల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో సిలబస్‌లో అనేక మార్పులు చేశామన్నారు. వివిధ సంస్థల నుంచి విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ఆలోచన చేయాలన్నారు. వీసీ జీఎం సుందరవల్లి మాట్లాడుతూ అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు జాబ్స్ కల్పించాలని పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి, ఎఫ్ఎంఎస్ఈ అధ్యక్షుడు ఏపీకే రెడ్డి, దొడ్ల డెయిరీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దొడ్ల శేషారెడ్డి, హైటెక్ ఫార్మా ఎండీ ఎస్‌వీ రమణారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి


డ్రైవర్ రజాక్ మృతదేహం

ఆత్మకూరు: ఆర్టీసీ డ్రైవర్ అబ్దుల్ రజాక్ (51) డ్యూటీకి హాజరయ్యేందుకు మోటార్‌బైక్‌పై ఆత్మకూరుకు బయలుదేరాడు. ఈక్రమంలో నెల్లూరు – ముంబై రహదారిపై నారంపేట అడ్డరోడ్డు సమీపంలో లారీ ఢీకొని మృతిచెందాడు. బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఆత్మకూరు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బోయలచిరివెళ్ల గ్రామానికి చెందిన రజాక్ ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 5 గంటలకు చేజర్ల బస్సు డ్రైవర్‌గా విధులకు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి బైక్‌పై ఆత్మకూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి వేప పుల్లలు కోసుకుని బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. ఈ సమయంలో నెల్లూరు నుంచి బళ్లారి వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. లారీ ముందు చక్రాల కిందకు బైక్ వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన రజాక్‌ను స్థానికులు ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.ముత్యాలరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హాస్పిటల్‌కు వెళ్లి రజాక్‌తో మాట్లాడారు. కాగా అతను చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. రజాక్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మకూరు ఆర్టీసీ డీఎం కరీమున్నీసా, సిబ్బంది బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ


వైద్య సేవల్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

చేజర్ల: మండలంలోని ఎన్‌వీ కండ్రిక (నూతక్కివారికండ్రిక)లో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారని తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం డీఎంహెచ్ఓ పెంచలయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి వద్దకు వెళ్లి మాట్లాడారు. రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. మరో మూడురోజులపాటు శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం చిత్తలూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, ఏఎంఓ నాగార్జున, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, చిత్తలూరు డాక్టర్లు నవీన్, జ్యోతి, సీహెచ్ఓ మంజుల, ఏటూరు పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 152
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 266
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 294
లేయర్ చికెన్	: 136

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.70
పండ్లు : రూ.25







సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ మీ అబ్బాయిలేదఅమ్మాయిబీటెక్/డిగ్రీఫెయిల్ అయ్యారనిలేదామధ్యలోచదువుఆగిపోయిందిఅనిఆలోచిస్తున్నారామీరుకోరుకున్నవిధంగావారు కోర్సుని కంప్లీట్ చేసుకొనే అవకాశం.9030030125. [T-3080]

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA,Regular/lateral entry.9381287629 [T-4921]

HOME TUTIONS
■ 1to X ఇంటర్, EAMCET, JEE Mains IIT & NEET లకు మీ ఇంటి వద్దె / మా వద్ద సీనియర్లచే 100% ర్యాంకు గ్యారంటీ శిక్షణ. శ్రీ చరణ్ IIT & NEET అకాడమీ. 99635 18004 [NA-23136]

REAL ESTATE

LAND FOR SALE
■ ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2 km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. (With Farm House) వివరాలకు సంప్రదించండి. : 70362 31356. [NA-23170]

PLOT FOR SALE
■ ప్లాట్ 11లక్షలకే, పోట్టేపాలెం,కొండ్లపూడిలో కలదు. 35 లక్షలకే NUDA ప్లాట్లు NH-5 ఈనాడు ఆఫీస్ దగ్గరలో కలవు. 80% బ్యాంక్‌లోన్ సౌకర్యం. 96666 16670 [G-8251]

■ కమర్షియల్ ప్రాపర్టీ : నరసింహకొండ దగ్గరలో హాస్పిటల్, సూపర్‌మార్కెట్ కట్టుకునేందుకు అనువైన DTCP Approved 128 అంకణాల ఉత్తరం 40 అడుగుల రోడ్డు, తూర్పు 80 అడుగుల రోడ్డు గల కార్నర్ ప్లాట్ అంకణం 50 వేలకు అమ్మబడును. వివరాలకు సంప్ర : 62814 11178, 91214 52347. [NA-10487]

■ నెల్లూరు నుండి 10km దూరంలో మైపాడు రోడ్డు (నెల్లూరు కోనసీమ) 50 అం॥ స్థలం, గార్డెన్, ఫాంహౌస్‌తో పాటు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: 83093 04379. [NA-23171]

TO-LET
■ గోడౌన్ : నెల్లూరు, వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర (పడుగుపాడు) 6లైన్ల హైవే అనుకుని, 24 గం॥లు లోడింగ్‌కి అనుకూలంగా, 1 ఎకరా స్థలంలో 50x75=3750Sft, కమర్షియల్ గోడౌన్, విశాలమైన వెహికల్స్ పార్కింగ్, టాయిలెట్లు, పుష్కలమైన మంచినీరు, సెక్యూరిటీ సౌకర్యంతో బాడుగకు కలదు.70133 32153, 97015 15664. [NA-10490]

SERVICES
■ మునీశ్వర ఇంటీరియర్ & ఉడ్ వర్క్స్.మా వద్ద అన్ని రకముల బ్రాండ్ కబోర్డ్స్ చేయబడును. లైఫ్ టైం వారంటీ. వివరాలకు సంప్రదించండి: ప్రేమ్‌కుమార్ ఆచారి. సెల్: 99080 43478. [NA-6267]

BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

■ ద్వారక ఎంటర్‌ప్రైజ్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

■ మీకు తెలిసిన వంట నైపుణ్యంతో మీ ఇంట్లోనే షీరో హోమ్ ఫుడ్ కిచెన్ ప్రారంభించి ప్రతినెల స్థిరమైన ఆదాయాన్ని పొందండి. ఉచిత సెమినార్‌లో పాల్గొనేందుకై. ఫోన్: 6309527444. [HA-1125]

WANTED
■ Wanted-CA Final/CA Inter / Accountant with 2 Yrs Experience to work at Audit Office. Contact: 86888 78884. [NA-23163]

■ Wanted Female Computer Operators. Qlf: B.Tech/MCA, Sal:15K, Timings : 8:30AM to 5PM, Year of Passed out : 2020/2021/ 2022/2023. Sent Resume to : 7995402877. [NA-6262]

■ Wanted Tally Accountant's 3 No's Above. with Computer Knowledge. Exp: 3 to 5 Years. Sri Durga Foods Nellore. Contact: 98859 51299. [NA - 5313]

■ Wanted M/F Sales Executives, Minium 1 Year Exp in Similar Field. Attractive Salary. Walk in Interview. Bombay Glass Design, Nellore. Contact: 99856 04784. [NA - 4031]

■ ప్రముఖ ఇంజనీరింగ్ యూనివర్సిటీలో వర్క్ చేయుటకు అనుభవజ్ఞులైన లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 10k+Inc. Qlf: ఏదైనా డిగ్రీ. 91005 82474, 63015 11415, నెల్లూరు. [N - 1189989]

■ సెక్యూరిటీ గార్డ్ (10th పాస్ / ఫెయిల్) దేవీసుపేట, నెల్లూరు టౌన్‌కి కావలెను. 10వేలు-12వేలు జీతము. వివరములకు సంప్రదించండి: 90102 14397. [NA - 10489]

■ మా VMR సంస్థ నందు పని చేయుటకు అనుభవం కలిగిన Female Telecallers కావలెను. ఆకర్షణీయమైన జీతం& Incentives ఇవ్వబడును. సంప్రదించండి: 76750 76326, 93989 12702. [NA-6266]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9502615217 [G-8541]

■ కూల్‌డ్రింక్ ఏజన్సీస్ నందు పర్మినెంట్‌గా పనిచేయుటకు డ్రైవర్స్, సేల్స్‌మెన్ కావలెను. వివరములకు సంప్రదించండి: 95333 02084. [N-1238120]

■ ఫ్యాకల్టీస్ కావలెను. MS-ఆఫీస్, వెబ్ & మొబైల్ టెక్నాలజీ,కంప్యూటర్ హార్డ్‌వేర్,క్లౌడ్ కంప్యూటింగ్, టాలీ,జావా, టైలరింగ్, బ్యూటీషియన్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్. 90001 73808. [N-1249457]

■ ప్రముఖ కంపెనీలలో పని చేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్,టెలికాలర్స్ కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్. విద్యా అర్హత : ఇంటర్, డిగ్రీ. వివరములకు సంప్ర దించండి: 63042 28875, 72075 11653. [N - 1238115]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ల డ్యూటీ, 45సం॥లోపు వయస్సు ఉండాలి. మగవారు మాత్రమే. వివరములకు సంప్రదించండి: 72880 04466, 72880 04477. [NA-11657]

■ KTMబైక్‌షోరూంలో పనిచేయుటకు అనుభవము కలిగిన సర్వీస్‌అడ్వైజర్స్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. బయోడేటాతో సంప్ర॥ HDFC బ్యాంక్ ఎదురు వేదాయపాలెం- NLR. 70135 69269. [NA-510]

■ నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల IOC పెట్రోలు బంకులో డే డ్యూటీకి పని చేయుటకు యువతి/ యువకులు & నైట్‌డ్యూటీకి యువకులు కావలెను. సంప్ర: 99082 99973, 95501 89885. [NA-6261]

■ నెల్లూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (M/F) Any Qualification. వివరాలకు సంప్రదించండి. సెల్ : 63019 11854. [NA-10486]

■ చిల్డ్రన్స్ గేమ్స్ జోన్ (ఆర్ట్ గ్లోబ్)లో పని చేయుటకు టెన్త్ పాస్ అయిన వారు కావాలి. అర్హతను బట్టి జీతం : రూ.8-20వేల వరకు. మహిళలకు ప్రాధాన్యం. సెల్: 70324 74231. [NA-2607]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మెసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 85027 12418, 90306 12463 [M-1233799]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167528]

■ బంగే కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నందు పనిచేయుటకు 2 సం. అనుభవం కల్గిన ఎలక్ట్రీషియన్ మరియు నైపుణ్యం లేని కార్మికులు కావలెను. ✆ 9885613828. [T-1252076]

■ HERO స్పేర్స్ డిస్ట్రిబ్యూటర్ కంపెనీలో పనిచేయుటకు డ్రైవర్లు కావలెను. సంప్ర: ఇనమడుగు సెంటర్, నెల్లూరు. ✆ 91000 66735. [O-192173]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9160900024 / 9640400073 [HA-1254]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 9391753308. [HA-1258]

■ మా సంస్థ నందు పని చేయుటకు Marketing Manager and Team Leaders and Photoshop Designer, ITI చదివిన ఎలక్ట్రీషియన్స్, RO టెక్నీషియన్స్,ACటెక్నీషియన్స్,ప్లంబర్స్ కావలెను. Salary + PF + ESI. Contact: 90007 31560. [NA-6265]

■ నెల్లూరులో ప్రముఖ ఆటోమొబైల్ షోరూమ్ నందు పనిచేయుటకు CRM సర్వీస్ (F) * టీం లీడర్స్ (M) * సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M) * టెలికాలర్స్ (F) * సర్వీస్ అడ్వైజర్స్ (M) * హౌస్‌కీపింగ్ (M) మరియు ఆఫీసు బాయ్స్ కావలెను. వెంటనే సంప్ర. ✆ 99085 42222 [B-1509]

■ మెడ్‌ప్లస్ ఫార్మసీ నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, కోవూరు మెడికల్ షాప్‌లో పని చేయుటకు ఫార్మాసిస్ట్ (PCI కలిగినా) D/B/M ఫార్మసీ మరియు మెడికల్ షాప్‌లో అనుభవం కలవారు కావలెను. PH: 6281024633, 8498062405. [HA-792]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.